డిటెక్టివ్ స్టోరీ

# ఓల్గా నుండి ప్రేమతో...

రేణిగుంట ఉత్తమ్

**1970**వ దశకం చివర్లో....

న్యూ ఢిల్లీ....

పాలెం విమానాశ్రయం.

"రష్యా నుండి రావలసిన ఫ్లైట్ నెం: ఏ.ఐ. **666** మరికొద్ది నిముషాల్లో ల్యాండవుతుంది." అని అనౌన్స్‌మెంట్ వినిపించడటంతో మిస్టర్ విఠల్‌రావు చదువుతున్న మేగజైన్ని మడచి బ్యాగులో వేసుకుని, లేచి "అరైవల్స్" అని వ్రాసివున్న వైపుకి అడుగులేసాడు. కొన్ని నిముషాల నిరీక్షణ తర్వాత తను ఎదురుచూస్తున్న వ్యక్తి కనిపించడంతో తన ఉనికిని తెలియజేస్తూ చేతిని గాల్లో ఊపాడు. ఫ్లైట్ నుండి వచ్చిన వ్యక్తి కూడా చిరునవ్వుతో విఠల్ వైపుకి చేయి వూపి అతని వైపుకి వచ్చాడు. విఠల్ దగ్గరుండి, అతని లగేజ్, ఇమ్మిగ్రేషన్ను క్లియర్ చేయించి విమానాశ్రయం నుండి బయటకు తీసుకొచ్చాడు. వీళ్ళ రాకను గమనించిన డ్రైవర్ వెంటనే కారును తీసుకొచ్చి లగేజ్‌ను అందుకుని, కారు వెనుక డోర్ తెరచి నిల్చున్నాడు. విఠల్ తనతో పాటు వచ్చిన వ్యక్తితో కారులో కూర్చున్న వెంటనే, లగేజ్‌ను డిక్కీలో పెట్టి, లాక్ చేసి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. మరుక్షణం కారు సిటీ వైపుకి శరవేగంతో దూసుకుపోయింది.



మిస్టర్ విఠల్.... రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)కి చీఫ్!

రష్యా నుండి వచ్చిన వ్యక్తి పేరు... కొచికోవ్!

అతను ఒకప్పుడు కే.జీ.బి. (రష్యన్ గూఢాచారి సంస్థ)లో పని చేసిన ముఖ్యమైన ఏజెంట్!

అక్షణంలో అతనికి తెలియదు తను ఓ పద్మవ్యూహంలో చిక్కుకుపోతున్నానని!!!

***

యు.యస్.యస్.ఆర్‌లో ఓ మారుమూల ప్రాంతం!

రిటైర్డ్ కల్నల్ బ్రొమకోవ్ మార్నింగ్ వాక్ చేస్తున్నాడు. దూరంగా ఓ కారు వస్తున్న అలికిడి వినిపించింది. బ్రొమకోవ్ తన నడకలో వేగాన్ని పెంచాడు. కారు హఠాత్తుగా దగ్గరకొచ్చినట్లు అనిపించి అటుకేసి చూసాడు. మరుక్షణం అతని కళ్ళు పత్తి కాయల్లా విచ్చుకున్నాయి.

క్షణంలో వెయ్యోవంతు సమయంలో సమయంలో కార్లోంచి కురిసిన బులెట్లతో అతని శరీరమంతా తూట్లు పడ్డాయి. మారుపేరుతో, తన ఉనికి బయట పడకుండా మారు మూల పల్లెటూర్లో కాలం వెళ్ళదీస్తున్న బ్రొమకోవ్ ఒకప్పుడు కే.జి.బి.లో క్రియాశీలక కార్యకర్త!

***

న్యూ ఢిల్లీలో ఫైవ్‌స్టార్ హోటల్ లోని ఓ గది!

విఠల్‌రావ్, కొచికోవ్ మెత్తటి మఖ్‌మల్ సోఫాలలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ సంభషణంతా రష్యన్ భాషలో సాగుతోంది. విఠల్‌రావ్ కొన్నేళ్ళు రష్యాలో కాన్సులేట్‌గా పని చేయడం మూలాన రష్యన్ భాషతో అనర్గళంగా మాట్లాడగలడు.

ఓడ్కా నిండిన గాబ్లెట్స్ ఇద్దరి చేతుల్లోను వున్నాయి. విఠల్‌రావ్ ఓ సిప్ చేసాక, అన్నాడు "మిష్టర్ కొచికోవ్! మీరిక్కడ క్షేమంగా వుండొచ్చు. నాకు తెలియకుండా దయచేసి ఎక్కడికీ వెళ్ళకండి. ఈ రెండురోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోండి. తర్వాత ఉద్యోగం, పర్మినెంట్ బస ఏర్పాట్లు మేము అరేంజ్ చేస్తాం.... ఓ.కే! మీరేం భయపడకండి. ఇది మీ దేశంలానే మీరు భావించవచ్చు"

"థ్యాంక్యూ మిష్టర్ విఠల్! మీమేలు మరచిపోలేను" తన గాబ్లేట్

లోని ఓడ్కాను ఖాళీ చేసి, విఠల్‌రావ్ వంక చూస్తూ కృత జ్ఞతా పూర్వకంగా అన్నాడు కొచికోవ్.

''యూ ఆర్ వెల్‌కం మిస్టర్ కొచికోవ్! ఇంతకీ అక్కడ పరిస్థితులెలా వున్నాయి?''

''చాలా దారుణంగా వున్నాయి. అమెరికాలో వాట ర్‌గేట్ కుంభకోణం బయటకి పొక్కాక ఆదేశం ప్రజా ఉద్యమాల నుండి, మిగతా ప్రపంచదేశాల విమర్శలు, అవమానాలు ఎదుర్కోవలసి వస్తోందని వాటినుండి తప్పించుకునేందుకు తన బద్ధశత్రువైన యు.యస్. యస్.ఆర్‌పై నెపాన్ని నెట్టడానికి ప్రయత్నిస్తోంది. అందుకని ఐక్యరాజ్యసమితి సహాయం కూడా తీసుకుం టోంది. గూఢాచార్య కార్యకలాపాలు చేసి మరొక దేశ అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకున్నారని సమితి గనుక నిరూపించిందంటే, మాదేశ ప్రతిష్టకు భంగం కలుగుతుందని ఇప్పుడు మావాళ్ళకు భయం పట్టు కుంది. డాలర్లకాశపడి తమ ఏజంట్లు రహస్యాలెక్కడ బయట పెడతారోనని ఆ ఆపరేషన్లో పనిచేసిన వారినం దరిని మా ప్రభుత్వమే రహస్యంగా ఎలిమినేట్ చేస్తోంది. అందుకనే మీ సాయం కోసం అర్థించాను. మీరే గనుక నాకు సహాయం చేయకపోయివుంటే ఈ పాటికి నన్ను కూడా చంపేసివుండేవారు.''

అతను చెప్పిందంతా ఓపిగ్గావిన్న విఠల్‌రావ్ చెప్పా డతనికి నింపాదిగా ''ఇప్పుడు మీరు భయపడనక్కర లేదు. నేను ఈరోజే పి.యం.ఓ. ఆఫీస్‌తో మాట్లాడి మీకు శాశ్వతంగా ఇక్కడే ఆశ్రయం వుండేట్టు చేస్తాను.''

***

యు.యస్.యస్.ఆర్‌లో ఓ మారుమూల ప్రాంతం!

రిటైర్డ్ కల్నల్ బ్రొమకోవ్ హఠాత్తుగా తనపై బులెట్ల వర్షం కురవడంతో తూలి క్రిందపడ్డాడు. అతను బులెట్ ప్రూఫ్ జాకెట్, ప్యాంట్స్ ధరించడంతో ఆ దాడినుండి తప్పించుకుని బ్రతికి పోయాడు. మరుక్షణం అతని బుర్ర పాదరసం కంటే వేగంగా పనిచేయడం ప్రారంభించింది. వెంటనే నేలమీద కాసేపలాగే చనిపోయినట్లు పడివు న్నాడు. పదినిముషాలు గడిచాక, మెల్లగా చుట్టుపక్కల పరిశీలనగా చూసాడు. వీధంతా నిర్మానుష్యంగా వుండ టంతో చటుక్కున లేచి వేగంగా పరుగెత్తాడు. తనింటి చుట్టూ ఖచ్చితంగా నిఘా వుంటుందని భావించిన అతను తన మిత్రుడైన పాల్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడికి తను వెళ్ళే సరికే పాల్ చనిపోయివుండటంతో అతని ఇల్లంతా గాలించి మారుపేరుతో వున్న కొన్ని పాస్‌పోర్టులు, బీరు వాలో వున్న సొమ్ముతో పాల్ ధరించే సాదాసీదా దుస్తుల్ని ఓ బ్యాగులో సర్దుకుని వెంటనే ఆ ఇంటి వెనుక ద్వారం గుండా బయటపడ్డాడు.

***

కొచికోవ్ ఉలిక్కిపడి నిద్రలేచాడు!

ఒళ్ళంతా స్వేదంతో నిండిపోయివుంది. ఉచ్ఛ్వాశ, నిశ్వాసాలు వేగంగా వుండటంతో అతని ఛాతిభాగం వేగంగా కదులుతోంది. అతను తనను తాను గిల్లి చూచుకున్నాడు. తను బ్రతికే వున్నాడు. గతం ఉప్పె నలా ఒక్కసారిగా గుర్తుకొచ్చింది అతనికి....

బ్రొమకోవ్ తన వేషభాషల్ని మార్చుకున్నాడు. ఓ కెఫేటేరియా నుండి ఇండియాలోని తన స్నేహితుడైన విఠల్‌తో కోడ్ భాషలో మాట్లాడాడు. అతన్నుండి గ్రీన్ సిగ్నల్ రావడంతో వెంటనే కొచికోవ్‌గా పేరుమార్చు కుని, అవసరమైన చోటల్లా డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెట్టి ఫ్లైట్ ఎక్కేసాడు. చివరి క్షణంలో ఎందుకో ఫ్లైట్ ఆగిపోయింది. రష్యన్ సైనికదళం హఠాత్తుగా ఫ్లైట్లోకి వచ్చి ప్రయాణికులందర్నీ ఓసారి పరిశీలించి వెళ్ళిపో యారు. తనని పరీక్షించడానికి వచ్చిన సైనికుని ముందు వంద రూబుళ్ళ నోట్ని ఎవరికీ తెలియకుండా జారవి డిచి అతని దృష్టిని మరల్చేలా చేసి, తను ఎక్కువగా ఎక్స్‌పోజ్ కాకుండా అతని కళ్ళుగప్పి పారిపోయి వచ్చే సాడు. నిజానికి భారత్‌లో విమానం లేండయ్యేంత వరకు, ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ అయ్యేంత వరకు తనకు టెన్షన్‌గానే వుంది.

అదో పీడకల! దాన్ని సాధ్యమైనంత త్వరగా మరచి పోవాలి.

ఎలా!? ఒంటరిగా ఈగదిలో వుంటే మళ్ళీ, మళ్ళీ అవే ఆలోచనలు, టెన్షన్!!

సరిగ్గా అప్పుడు మ్రోగిందా గదిలోని కాలింగ్‌బెల్.

***

ఇండియాలో ఓ ప్రముఖ కంపెనీ ఆఫీస్. నిజానికది అమెరికన్ సి.ఐ.ఏ విభాగానికి చెందింది. ఆ కంపెనీ యం.డి రూంలోని టెలిఫోన్ మ్రోగింది. అందుకున్న యం.డి. అవతల లైన్లో వున్న అతను చెబుతున్న విష యాన్ని పూర్తిగా విని ఏంచేయాలో చెప్పి ఫోన్ క్రెడిల్ చేసాడు.

***

రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) కాన్ఫరెన్స్ హాల్.

సూది నేల మీద పడితే వినబడేంత నిశ్శబ్దం ఆవరిం చివుందా గదంతా. దాదాపు ఎనిమిది మంది టాప్‌రేంక్ ఆఫీసర్లు కూర్చుని వున్నారు. ఫుల్‌సూట్లో వున్న ఓ ఆఫీ సర్ లేచి చెప్పడం మొదలు పెట్టాడు.

''డియర్ ఫ్రెండ్స్! రష్యన్ ఇంటెలిజెన్స్ వింగ్ నుండి మాజీ ఏజెంట్ మనదేశంలోకి అక్రమంగాచొరబడ్డాడని, అతన్ని ఎలిమినేట్ చేయవలసిందిగా ఆ దేశపు ప్రెసి డెంట్ మన ప్రధానితో మాట్లాడారు. అతన్ని మనం రక్షించిన పక్షంలో మన మిత్రదేశమైన రష్యాకి కోపం తెప్పించిన వాళ్ళమౌతాం. అలాగే, అతన్ని రక్షించి, తమకు అనుకూలంగా సాక్షిగా వాడుకోవాలని అమె రికా యోచిస్తోంది. అతన్ని తమ కప్పగించమని అమె రికా నుండి అభ్యర్ధన కూడా అందింది. ఈక్షణంలో మనం కత్తిమీద సాము చేస్తున్నట్లే లెక్క! ఎందుకంటే మనదేశం మొదటినుండి తటస్థ విధానాన్ని, అలీన విదే శాంగ విధానాన్ని అనుసరిస్తోంది. అందుకని ఇరువ ర్గాల మధ్య మనం సంయమనం పాటించి, మనదేశా నికి చెడ్డపేరు రాకుండా, ఈ సమస్యను ఎలా పరిష్కరిం చాలన్నదే యిక్కడ ముఖ్యమైన విషయం. ఈ బాధ్య తను ప్రభుత్వం శ్రీ విఠల్‌గారికి అప్పగించమని కోరింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలన్నీ ఈ మైక్రో చిప్‌లో వున్నాయ్'' అని విఠల్ చేతికి మైక్రోచిప్‌ని అందించాడు. మైక్రో చిప్ అందుకుంటున్నప్పుడు, ఆ ఆఫీసర్ కళ్ళల్లో 'కొచికోవ్ (బ్రొమకోవ్) నీ రక్షణలో వున్నాడని మాకు తెలుసు సుమా!' అన్న భావన స్ఫురించింది విఠల్‌కి.

''యస్ సార్! నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తా!''

అంటూ అతన్నుండి మైక్రోచిప్ అందుకున్నాడు విఠల్ రావు. అతని భృకుటి ముడిపడింది. ఆ క్షణంలో అతనికి తెలియదు అమెరికన్ సి.ఐ.ఏ. కొచికోవ్‌ని ప్రాణాలతో పట్టుకోవడానికి అప్పటికే రంగంలోకి దిగిందని!

***

కొచికోవ్ లేచి తలుపు తీసాడు.

ఎదురుగా జీన్స్ ప్యాంటు, వైట్ టాప్ వేసుకున్న అందమైన పాతికేళ్ళ అమ్మాయి కనిపించింది. చూపు తిప్పలేనంత అందం అమెది. కొచికోవ్ ఆమెవంక ప్రశ్నా ర్థకంగా చూసాడు. అతని సంశయాన్ని పసిగట్టిన అమ్మాయి రష్యన్ భాషలో చెప్పింది.



"నా పేరు పద్మావతి. నేను విఠల్‌రావు గారు పంపితే వచ్చాను."

"లోపలికి రండి" తలుపు నుండి పక్కకు జరిగి ఆమెను లోపలికి ఆహ్వానించాడతను. ఆమె లోపలికి వచ్చాక తలుపు మూసి, కూర్చోవడానికి సోఫా చూపించి తనూ కూర్చుంటుండగా చెప్పిందామె.

"నేను ఈ రోజు నుండి మీ పర్సనల్ అసిస్టెంట్ని. మీ పనులన్నీ నన్ను చూసుకోమన్నారు." అమె హస్కీ వాయిస్ అతడ్ని వివశుడ్ని చేస్తోంది. భారతీయులలో యింత అందమైన అమ్మాయిని అతనెప్పుడూ చూడ లేదు. అందులో స్త్రీ సాంగత్యానికి దూరమై చాలా రోజులు కావడంతో, సభ్యత కాదనిపించినా, ఆమె సౌందర్యానికి సమ్మోహితుడై అలా చూస్తూండిపో యాడు. అతని కళ్ళల్లోని కాంక్షను పసిగట్టిన ఆమె నెమ్మదిగా అంది అతనితో.

"ఈరోజు మనం సిటీ అంతా చూస్తున్నాం సార్! డిన్నర్ తర్వాత రాత్రి నేను వెళ్ళిపోవాల్సివుంటుంది."

"ఓ ఇట్స్ ఎ ప్లెజర్" అతని కళ్ళు మిలమిలా మెరుస్తుండగా చెప్పాడు. మరో అరగంటలో అతను తయారయి, యిద్దరూ కలసి బయటకి వెళ్ళిపోయారు.

***

ఇండియా గేట్!

కొచికోవ్, పద్మ ఇండియా గేట్ దగ్గరకారాపి ఆ కట్టడం లోపలికి వెళ్ళారు. ఇంతలో హఠాత్తుగా ఇద్దరు ఆగంతకులు వాళ్ళిద్దర్నీ రివాల్వర్లతో కవర్ చేసి, తమతో లాక్కెళ్ళడానికి ప్రయత్నించసాగారు. క్షణాల్లో జరిగిన ఈ సంఘటనకు అక్కడున్న మిగతా టూరిస్టులు భీతవహులై చెల్లాచెదురుగా పరిగెత్తసాగారు. ఆ హడావుడిలో వీళ్ళని తమ వ్యాన్ వైపుకి లాక్కెళ్ళసాగారు అగంతకులు. సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన!!!

***

విఠల్‌రావ్, కొచికోవ్ గదికి ఫోన్ చేసాడు. ఎంతసేపటికీ లిఫ్ట్ చేయకపోవడంతో హోటల్ వాళ్ళని వాకబు చేసాడు. కొచికోవ్ గుర్తుతెలియని ఓ అమ్మాయితో కలిసి వెళ్ళిపోయాడని తెలిసిన మరుక్షణం అతను అక్కడకు చేరుకున్నాడు.

కొచికోవ్ గదిలోకి వెళ్ళి పరిశీలనగా చూసాక అతనికి, బెడ్ పక్కన, తలవైపున వున్న బెడ్ ల్యాంప్ పక్కనున్న చిన్న సైజు టేబుల్ పై ఓ గిఫ్ట్‌పాకెట్ పెట్టాడతను. దాని మీద "ఓల్గా నుండి ప్రేమతో" అని రష్యన్ భాషలో వ్రాసి వుంది. చిన్నగా నవ్వుకుని అక్కడినుండి వెనుదిరిగాడు.

***

ఎక్కడినుండి వచ్చాడో తెలియదుకానీ ఓ సర్దార్జీ తన మెడనుండి వీపు వైపుకి అడ్డంగా వేలాడుతున్న పొడవాటి కృపాణాన్ని ఒరలోంచి తీసి, కొచికోవ్‌ని, పద్మని లాక్కెళుతున్న ఆగంతకులపై సూటిగా విసిరాడు. ఆగంతకులు ఒక్కక్షణం అదిరిపడి దిక్కులు చూచారు. ఆ క్షణాన్ని ఎంతో ఒడుపుగా తమ కనుకూలంగా మార్చుకుని, ఆగంతకులు తేరుకునే లోపునే, కొచికోవ్, పద్మ వారి నుండి తప్పించుకుని ముందుకురికారు. వెనుకనుండి ఆగంతకులు కాల్పులు జరుపుతుండగా తమ కారులోకి దూసుకుపోయారు. మరుక్షణం వాయువేగంతో ముందుకురికింది కారు.

ఆగంతకులు ఆ కారు వైపుకు పరుగులు తీస్తూ కాల్పులు జరపనారంభించారు.

సర్దార్జీ నేలమీద పడ్డ తన కృపాణాన్ని అందుకుని, కళ్ళ కద్దుకుని ఒరలోకి వేసుకుని తన జేబులోంచి ఓ పాకెట్ సైజ్ వాకీ-టాకీని అందుకుని విఠల్‌రావుకి జరిగింది చెప్పి అక్కడి నుండి చిరునవ్వుతో నిష్క్రమించాడు.

***

కొచికోవ్ గది!

అతను బెడ్‌పై బోర్లా పడుకుని వుండగా, అతని బాడిని మసాజ్ చేస్తోంది పద్మ. ఆ క్షణంలో అతను రిలాక్స్‌గా వుండగా పద్మ అతని పక్కనే మెల్లగా ఒరిగింది. ఆమాత్రం చనువు చాలు కొచికోవ్‌కు ఆమెను తన మీదకు లాక్కున్నాడతను ఆబగా.

హఠాత్తుగా అతని దృష్టి "ఓల్గానుండి-ప్రేమతో" అని వ్రాసివున్న పాకెట్ పై పడింది. అతను ఆశ్చర్యంగా దాన్నందుకుని విప్పదీసాడు. మరుక్షణం అందులో వున్న రూంఫ్రెషనర్ ఆటోమేటిగ్గా ఓపెన్ అయింది. ఆ సువాసనకి ఇద్దరికీ మత్తు వచ్చేలా వుంది. అతను ఆమెను మరోసారి వాటేసుకుని మళ్ళీ పక్కమీదకి వాలిపోయాడు.

ఆక్షణంలో అతనికి తెలియదు అది మామూలు రూంఫ్రెషనర్ కాదని, రూంఫ్రెషనర్‌తో పాటు ప్రాణాలు తీసే గరళం కూడా అందులో కలసివుందని.

***

ఉదయభానుడు తన లేలేత కిరణాలని శరపరంపరలుగా ప్రపంచం పైకి ప్రయోగిస్తున్నాడు. కానీ, వరుణదేవునికీ, అదిత్యునితో పేచీ వచ్చిందేమో అక్కడక్కడా చిరు జల్లులు కురిపిస్తున్నాడు. ఇలా కలగాపులంగా వున్న వాతావరణం అప్పుడే వయసొచ్చిన చిన్నది పవిటేసుకున్నటు డోలాయ మాన స్థితిలో తేలుతోంది.

"సారీ సర్! హీయీజ్ డెడ్! ఉదయం, ఐదు, ఐదున్నర మధ్యలో ప్రాణంపోయి వుండవచ్చు" అన్నాడు డాక్టర్. మరో అరగంట తర్వాత పోస్ట్‌మార్టం రిపోర్ట్ అందింది విఠల్‌రావుకి. అందులో "నిద్రలో సివీయర్ హార్ట్ ఎటాక్ వలన మరణం సంభవించిందని" వుంది.

అది మృత్యువాత పడ్డ కొచికోవ్ తాలూకు పోస్ట్ మార్టం రిపోర్ట్!!!

***

సిటీని దాటి దాదాపు ఇరవై కిలోమీటర్లు ప్రయాణం చేసాక యమునా నది ఉధృతంగా ప్రవహించే నిర్జీవమైన ప్రదేశంలో ఆగిందా కారు. అందులోంచి విఠల్‌రావు, పద్మావతి దిగారు. ఓ క్షణం తర్వాత తాపీగా అన్నాడు విఠల్‌రావు.... "నువ్వనుకుంటున్నట్లు అది మామూలు రూం ఫ్రెషనర్ కాదు. అందులో తొంభైతొమ్మిది శాతం పోలోనియం అనే ప్రాణాంతకమైన విషం నిండివుంది. అది గాలిలో చాలా ఈజీగా కలసిపోతుంది. రాత్రంతా దాన్ని పీల్చిన కొచికోవ్ తెల్లారే సరికల్లా మరణించాడు."

"అమ్మో! అతనితో పాటు నేనూ అక్కడే వుంటే ఈ పాటికి..." ఆమె ముఖంలో భయం కొట్టొచ్చినట్లు కనబడింది. విఠల్‌రావు విషపునవ్వు నవ్వి చెప్పాడు.

"ఇప్పటికీ మించిపోయిందేమీ లేదుగా...." అతని చేతిలో తళ, తళ మెరుస్తున్న రివాల్వర్‌ని చూచి భీతిగా అందామె.

"సార్...మీరు...నన్ను..నన్ను కూడా...!"

"సారీ డియర్ ఈ కేసునుండి నన్ను నేను రక్షించుకోవాలంటే తప్పదు. నేను మొదట్లో కొచికోవ్‌ని చంపాలనుకోలేదు. కానీ నా పై ఆఫీసర్స్... మనసుతో కాక డిప్లమసితో నన్ను ఆలోచించమన్నారు. అదీకాక, సి.ఐ.ఏ ఏజెంట్స్ మీరు ఢిల్లీ గేట్ దగ్గరున్నప్పుడు దాడి చేసారు. మీ వెన్నంటే నా మనిషిని రహస్యంగా పంపబట్టి మీరు వాళ్ళ నుండి తప్పించుకోగలిగారు. లేకపోతే ఎలాంటి చిత్రహింసలకు గురయ్యేవాళ్ళో కదా! ఇటు రష్యాతోనూ, అటు అమెరికా తోను గొడవరాకుండా వుండాలంటే ఎలిమినేషన్ ఒక్కటే మార్గమని పించింది. అతన్ని చేరదీసినందుకు, అతన్ని వదిలించుకునే పూచికూడా నా మీదే వుంచారు. లేకుంటే రిటైరయ్యే ఈ వయసులో డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీలు, సస్పెన్షన్లు నా కవసరమా చెప్పు! ఆ రాత్రి అతనితోనే గడుపుతావని అనుకున్నాను. కానీ, ఎందుకో నువ్వు అక్కడి నుండి వెళ్ళిపోయావు. సాక్ష్యాధారాలేమీ లేకుండా జాగ్రత్త పడటం నాకు మొదటినుండి అలవాటు. అందుకే నిన్ను చంపక తప్పదు. ఏమనుకోకు!"

అతని చూపుడువేలు ట్రిగ్గర్ని నొక్కడానికి సిద్ధంగా వుంది.

పద్మావతి అతన్నుండి దూరంగా పారిపోవడానికి ప్రయత్నించింది. కానీ ఆమె నిల్చున్న నేలంతా చిత్తడిగా వుండటంతో జారి ఉధృతంగా ప్రవహిస్తున్న యమునలో పడి కొట్టుకుపోయింది.

***

మరుసటి రోజు రెండు వార్తలు ఢిల్లీ టైమ్స్‌లో ఓ మూలంగా ప్రచురింపబడ్డాయి. అవి

ఒకటి... రష్యా యాత్రికుడొకడు గుండెపోటుతో మరణించాడని!

రెండోది, యమునా నదిలో దూకి ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని

*

రచయిత సెల్ నెం. 9966370592



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### కేరింతలు

పసికందును ఎత్తుకుని, కార్లోంచి దిగిన యువకుడి వేపుచూసి, "ఇతడు హంతకుడిలా లేడు" అన్నాడు ఇనస్పెక్టర్.

"అమాయకంగా కనిపించే వాళ్ళంతా అమాయకులు కాకపోవచ్చు. మీరైతే ఎంక్వైరీ ప్రారంభించండి" అన్నాడు డిటెక్టివ్.

ఆ యువకుడు, క్రితం రాత్రి హత్య చెయ్యగా చూశానని ప్రత్యక్షసాక్షి ఒకడు స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అందువల్ల అతణ్ణి అదుపులోకి తీసుకోక తప్పదు.

"మనిషిని పోలిన మనుషులుండరా. అతడి స్టేట్‌మెంట్ పచ్చి అబద్ధం" అన్నాడు. యువకుడు చేతుల్లో వున్న పసికందును కారు హుడ్ మీద నిలబెట్టి చంటిపిల్లాడు, బాయ్‌నెట్ మీద ఎగురుతూ, కేరింతలతో అందర్నీ నవ్వించాడు.

"హత్య నిన్నరాత్రి పదింటికి జరిగిందంటున్నారు. నేను, నిన్న రాత్రి ఎనిమిదింటికి బయలుదేరి, నాన్‌స్టాప్‌గా డ్రైవ్‌చేసి, ఇదిగో మీ ముందర, యిప్పుడే యిక్కడికి చేరుకున్నాను" అన్నాడు యువకుడు.

"అంటే, ఆరువందల మైళ్ళు, పన్నెండు గంటల్లో కవర్ చేశావన్న మాట" అన్నాడు ఇనస్పెక్టర్.

"మీకు సందేహమా?" అన్నాడు యువకుడు.

"సందేహమెందుకు? నీకు అబద్ధమాడటం కూడా రాదు" అన్నాడు డిటెక్టివ్.

యువకుడు బుకాయిస్తున్నాడని, డిటెక్టివ్ ఎలా పసిగట్టాడు.

సమాధానం: ఆరువందల మైళ్ళు నాన్‌స్టాప్ ప్రయాణం తర్వాత కారెంత వేడెక్కుతుందో అందరికీ తెలుసు. పసి కుర్రాడు హుడ్ మీద నిల్చుని కేరింతలు వెయ్యగలడా?